సాక్షి
సూర్యాపేట
బుధవారం । 8 । నవంబర్ । 2023



మలిదశ కష్టమవుతోంది
సమస్యలపై గళమెత్తినా స్పందించే వారు లేరని సాక్షి పీపుల్స్ ఎజెండాలో రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. - IIలో



శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం
మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యకల్యాణాన్ని మంగళవారం నిర్వహించారు. - IIలో



మంత్రి పదవులు త్యాగం
కొండా లక్ష్మణ్ బాపూజీ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధనకు మంత్రి పదవులు త్యాగం చేశారు. - IIలో

న్యూస్‌రీల్

క్రీడల్లో అద్భుతంగా ప్రతిభ కనబర్చాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ అశోక్

సూర్యాపేటటౌన్ : క్రీడోత్సవాల్లో విద్యార్థులు అద్భుతంగా ప్రతిభ కనబర్చాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా స్కూల్ గేమ్స్ క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చి విద్యాశాఖకు పేరు ప్రతిష్ఠలు తీసుకొస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా అండర్ 14, 17 విభాగాల్లో జిల్లా స్థాయి కబడ్డీ, ఖో ఖో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఆజంబాబా, ప్రిన్సిపల్ యాదయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓపీఓల శిక్షణ తాత్కాలిక వాయిదా

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించ తలపెట్టిన ఓపీఓల శిక్షణ తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్, జిల్లాఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి శిక్షణ కార్యక్రమం వివరాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయి అధికారులు , మండల విద్యా శాఖాధికారులు ఎన్నికల నిర్వహణపై తమ పరిధిలో గల ఎన్నికల సిబ్బందితో ఈ నెల 10 న సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

విశ్వరూప మహాసభకు లక్షలాదిగా తరలి రావాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : ఈనెల 11న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు లక్షలాదిమంది తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్ బాబు, జిల్లా ఇన్‌చార్జ్ తూర్గంటి అంజన్న అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్‌లో మాదిగల విశ్వరూప మహా సభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగల విశ్వరూప మహాసభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ సీనియర్ నాయకులు గుద్దేటి ఎల్లయ్య మాదిగ, రాష్ట్ర నేతలు చిన్న శ్రీరాములు, జిల్లా కో ఇన్‌చార్జి ములకలపల్లి రవి, బోడ శ్రీరాములు, పుట్టల మల్లేష్ మాదిగ, బొడ్డు విజయ్, బొజ్జ వెంకన్న, దైద వెంకన్న, మేడి కృష్ణ, నవీన్, చెరుకుపల్లి సతీష్, కొండేటి గోపి, మల్లేష్, సుధాకర్, సతీష్ మాదిగ, సావిత్రి, గ్యార కనకయ్య పాల్గొన్నారు.

కోదాడ జనసేనకే..

మూడు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

- మునుగోడులో చలమల్ల కృష్ణారెడ్డికే కమలం టికెట్
- మిర్యాలగూడ, నకిరేకల్‌లోనూ అభ్యర్థుల ప్రకటన
- కోదాడలో జనసేన అభ్యర్థిగా మేకల సతీష్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో ఇంకా మూడు స్థానాల్లో తేలని అభ్యర్థులు
- మరో రెండు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన సీపీఎం
- సీపీఐతో కాంగ్రెస్‌కు కుదిరిన పొత్తు.. 'హస్తా'నికి 'కంకి కొడవలి' మద్దతు





చలమల్ల కృష్ణారెడ్డి



సాదినేని శ్రీనివాస్



మొగులయ్య





మేకల సతీష్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో మూడు స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. జిల్లాలోని 12 నియోజకవర్గాలకు గాను ఇప్పటికే 8 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ మంగళవారం మరో మూడు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన చలమల్ల కృష్ణారెడ్డిని మునుగోడులో పోటీలో నిలుపుతున్నట్లు ప్రకటించింది. అలాగే మిర్యాలగూడ నుంచి సాదినేని శ్రీనివాస్, నకిరేకల్ నుంచి నకరకంటి మొగులయ్యను అభ్యర్థులుగా ప్రకటించింది. కోదాడ నుంచి ఎవరిని పోటీలో నిలుపుతామన్న విషయాన్ని ప్రకటించలేదు. అయితే, జనసేనతో పొత్తు కుదిరిన నేపథ్యంలో కోదాడ నియోజకవర్గాన్ని జనసేనకు ఇచ్చే ఒప్పందంలో భాగంగానే ఆ స్థానానికి బీజేపీ అభ్యర్థిని ప్రకటించలేదని కమలం పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, జనసేన అభ్యర్థిగా మేకల సతీష్ రెడ్డి పేరును ఆ పార్టీ ఖరారు చేసి ప్రకటించింది.

కాంగ్రెస్‌కే సీపీఐ మద్దతు

కాంగ్రెస్‌తో సీపీఐకి ఒప్పందం కుదిరింది. దీంతో ఈ ఎన్నికల్లో సీపీఐ.. కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ఒక ఎమ్మెల్యే స్థానాన్ని సీపీఐకి కేటాయించడంతో పాటు రెండు ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించడం.. అందులో మునుగోడు నియోజకవర్గానికి ఒక ఎమ్మెల్సీ కేటాయిస్తామని చెప్పడంతో పొత్తుకు అంగీకరించారు. దీంతోనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీపీఐ పార్టీ కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతును ప్రకటించింది. గతంలో చేస్తామన్న ఫ్రెండ్లీ కాంటెస్ట్ ఇకపై ఉండదని ఆ పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

క్రమంగా అభ్యర్థులను ప్రకటిస్తున్న సీపీఎం



కాంగ్రెస్ పార్టీతో సీపీఎంకు పొత్తు కుదరక పోవడంతో సీపీఎం తమ అభ్యర్థులను ప్రకటిస్తోంది. ఇప్పటికే మిర్యాలగూడ నుంచి జూలకంటి రంగారెడ్డిని మొదటి జాబితాలో ప్రకటించింది. ఆయనతోపాటు నకిరేకల్ నుంచి బొజ్జ చిన వెంకులు, భువనగిరి నుంచి కొండమడుగు నర్సింహ పోటీలో ఉంటారని సీపీఎం ప్రకటించింది. సోమవారం రాత్రి నల్లగొండ అభ్యర్థిగా ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డిని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం మునుగోడుకు దోనూరి నర్సిరెడ్డి, కోదాడకు మట్టిపల్లి సైదులు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. ఇప్పటికైతే కాంగ్రెస్‌తో పొత్తు లేకపోవడంతో సీపీఎం ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటిస్తోంది.

ఇంకా మూడు సీట్లను తేల్చని కాంగ్రెస్



కాంగ్రెస్ పార్టీ 12 నియోజక వర్గాలకు గాను 9 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇంకా మూడు స్థానాల్లో అభ్యర్థుల ఖరారును పెండింగ్‌లో పెట్టింది. ఆ మూడింటికి మోక్షమెప్పుడోనని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. మిర్యాలగూడ స్థానాన్ని మొదటగా పొత్తులో భాగంగా సీపీఎంకు కేటాయించాలని భావించారు. అందులో భాగంగానే ఆ స్థానాన్ని అభ్యరిని ప్రకటించలేదు. పైగా స్థానాలను తేల్చాలని సీపీఎం విధించిన గడువు ముగియడంతో సీపీఎం మిర్యాలగూడలోనూ తమ అభ్యర్థిగా జూలకంటి రంగారెడ్డి పేరును మూడు రోజుల కిందట ప్రకటించింది. అయినా కాంగ్రెస్ పార్టీ అక్కడ తమ అభ్యర్థిని ఇంతవరకు ఖరారు చేయలేదు. ఇక సూర్యాపేట, తుంగతుర్తి పరిస్థితి కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఒక్కో చోట ఇద్దరేసి నేతలు టికెట్‌ను ఆశిస్తుండటంతో అధిష్టానం అభ్యర్థిని ఖరారు చేయడంలో ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో పడింది. ఈ నెల 10వ తేదీ నామినేషన్లకు చివరి గడువు. ఇక మూడు రోజులే సమయం ఉంది. అభ్యర్థులను ఎప్పుడు ప్రకటిస్తారని పార్టీ శ్రేణులు ఎదురుచూస్తున్నాయి.

భవిష్యత్ తరాల కోసం పనిచేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

- కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష
- విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : 'రానున్న ఎన్నికల గుర్తించి మేం ఆలోచించడంలేదు.. భవిష్యత్ తరాల కోసం పనిచేస్తాను' అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేటలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి హాజరై మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కొనసాగాలంటే తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రావాలన్నారు. నూటికి నూరు శాతం మేనిఫెస్టోను అమలు చేసిన ఏకైక పార్టీ దేశంలో బీఆర్‌ఎస్ మాత్రమే అని అన్నారు. తెలంగాణలో వలసలను నిరోధించి, 30 లక్షల మంది ఇతర రాష్ట్ర కూలీలకు ఉపాధి ఇచ్చే స్థాయికి చేర్చిన ఘనత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వానిది అని పేర్కొన్నారు. పదేళ్ల కాలంలో సూర్యాపేటలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తించాలని, ప్రజల ఆశలు, ఆశయాల మేరకు పని చేశానని తెలిపారు. ప్రపంచ స్థాయి పట్టణాల సరసన సూర్యాపేట ను చేర్చడమే తన స్వప్నం అని చెప్పారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి అవుతుందన్నారు. 'సూర్యాపేటలో నాకంటూ శత్రువులు ఎవరూ లేరు.. ప్రజల భూములు, ఆస్తులు గుంజుకొని వారికి శత్రువులైన వారంతా నా శత్రువులే' అని అన్నారు. వారి అక్రమాలకు అడ్డుపడినందుకే ఉమ్మడి జిల్లాలో శత్రువులు అంతా ఏకమయ్యారని అలాంటివారిని తరిమికొట్టే బాధ్యత ప్రజలదే అని అన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే

సూర్యాపేట రూరల్ : తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట రూరల్ మండలం రేఖ్యానాయక్ తండా వాసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలు గిరిజనులను ఓటు బ్యాంకుగానే చూశాయి తప్పా, వారి బాగోగులను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. గిరిజన గ్రామాల్లో స్వయం పాలనను అందించిన గొప్ప మనసున్న నేత సీఎం కేసీఆర్ అని అన్నారు. తండాల్లో రోడ్లు, మంచి నీటి వసతులు కల్పించడంతోపాటు పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించామన్నారు.

సోషల్ మీడియా ప్రచారంపై గట్టి నిఘా

- ఎన్నికల అధికారి వెంకట్రావు
- కలెక్టరేట్‌లో సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్ ప్రారంభం



సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్‌ను కలెక్టర్‌తో కలిసి ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, వార్తలపై గట్టి నిఘా పెంచామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్‌ను కలెక్టర్‌తో కలిసి అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సప్, యూట్యూబ్, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాల్లో ప్రచారం ఎక్కువగా వస్తున్నందున ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా సోషల్ మీడియా ఐటమ్స్‌పై ఎప్పటికప్పుడు ట్రాకింగ్ చేస్తూ తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా పరిశీలన అనంతరం ఆయా నియోజక వర్గాలకు సోషల్ మీడియా వార్తలు, ప్రకటనలు పంపిస్తామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సోషల్ మీడియాలో వచ్చే వాటిని పరిశీలనలోకి తీసుకొని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మీడియా సెంటర్, ఇంటిగ్రేటెడ్ ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, చెక్‌పోస్టుల్లో తనిఖీలు, సంబంధిత రికార్డులు, మీడియా సెంటర్‌లో చానల్స్ రికార్డింగ్‌ను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పెయిడ్ న్యూస్, పెయిడ్ ఆర్టికల్స్‌పై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సురేష్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఆర్‌ఓ రమేష్ కుమార్, డీఐఈఓ మల్లేశం, ఏఓ సుదర్శన్ రెడ్డి, సోషల్ మీడియా ట్రాకింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

9, 10తేదీల్లో ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడాపోటీలు

హాలియా: జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి ఆదేశాల మేరకు ఈనెల 9, 10వ తేదీల్లో మిర్యాలగూడ పట్టణంలోని (హౌజింగ్ బోర్డు) క్లిమో స్పోర్ట్స్ ఏరీనా ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి వాసు దేవరావు మంగళవారం తెలిపారు. ఈనెల ఈ పోటీలుక 14, 17 సంవత్సరాల బాలబాలికల విభాగం వారు అర్హులని పేర్కొన్నారు. అదే విధంగా మిర్యాలగూడ, నల్లగొండ, దేవరకొండ డివిజన్ల జిల్లా స్థాయి జోనల్ క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ఉంటుందని, 17 సంవత్సరాలలోపు బాలబాలికలు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు బోనఫైడ్ సర్టిఫికెట్‌తో పాటు 10వ తరగతి మెమో జీరాక్స్ ప్రతులతో హాజరుకావాలని కోరారు. మిర్యాలగూడ డివిజన్ కార్యదర్శి వెంకట్రాంరెడ్డి 94401 81112 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఊపందుకున్న నామినేషన్లు

- మంగళవారం 37 దాఖలు

5వ రోజు నియోజకవర్గాల వారీగా దాఖలైన నామినేషన్లు		ఇప్పటి వరకు మొత్తం
నల్లగొండ	5	13
కోదాడ	3	09
సూర్యాపేట	7	12
మునుగోడు	2	13
నాగార్జునసాగర్	3	08
నకిరేకల్	5	11
ఆలేరు	-	07
తుంగతుర్తి	1	04
మిర్యాలగూడ	6	13
భువనగిరి	2	08
హుజూర్‌నగర్	3	04
దేవరకొండ	-	05
మొత్తం	37	107

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో మంగళవారం నామినేషన్లు ఊపందుకున్నాయి. ఒక్క రోజే 37 నామినేషన్లు దాఖలయ్యాయి. నల్లగొండలో కాంగ్రెస్ నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీఎస్పీ నుంచి ఒకరు, ఇండిపెండెంట్లు ముగ్గురు, మునుగోడులో ఇండిపెండెంట్ ఒకరు, యుగతులసి పార్టీ నుంచి ఒకరు, మిర్యాలగూడలో విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి ఒకరు, డీఎస్పీ నుంచి ఒకరు, స్వతంత్రులు నలుగురు, నాగార్జునసాగర్‌లో డీఎస్పీ నుంచి ఒకరు, స్వతంత్రులు ఇద్దరు, నకిరేకల్‌లో బీఎస్పీ ఒకరు, స్వతంత్రులు నలుగురు నామినేషన్లు సమర్పించారు. సూర్యాపేటలో ప్రజావాణి నుంచి ఒకరు, డీఎస్పీ నుంచి ఇద్దరు, యుగతులసి పార్టీ నుంచి ఒకరు, బహుజన ముక్తి పార్టీ నుంచి ఒకరు, ఇండిపెండెంట్లు ఇద్దరు, తుంగతుర్తిలో ఇండిపెండెంట్ ఒకరు, హుజూర్‌నగర్‌లో స్వతంత్రులు ముగ్గురు, కోదాడలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి ఒకరు, ఇండిపెండెంట్లు ఇద్దరు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆలేరు, దేవరకొండలో నామినేషన్లు వేయలేదు.భువనగిరిలో భారతీయ స్వదేశీకాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరు, ప్రజాఏక్తా పార్టీ నుంచి ఒకరు నామినేషన్ వేశారు. ఇప్పటి వరకు మొత్తం 107 నామినేషన్లు వచ్చాయి.

పోస్టల్ బ్యాలెట్ అక్రమాలకు చెక్!

- శిక్షణ కేంద్రంలో ఓటు వేసేలా ఏర్పాట్లు
- రెండో విడత శిక్షణలో ఓటు వినియోగం
- ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులతో పాటు మరి కొందరికి అవకాశం



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇస్తున్న పోస్టల్ బ్యాలెట్ ఓట్లు దుర్వినియోగం అవుతున్నాయన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఈ ఎన్నికల్లో వారి ఓటును వారికి చేతికి ఇవ్వరు, రెండో విడత శిక్షణ ఇచ్చే ఫెసిలిటేషన్ కేంద్రంలో ఆ ఓటును వినియోగించుకోవాలి. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధానం అమల్లోకి తెచ్చింది. గతంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ తీసుకుని కౌంటింగ్ ప్రారంభమయ్యే రోజు గంట ముందు వరకు కూడా ఓటేసే వారు. ఈ సారి అవకాశం లేదు. గతంలో పలువురు అభ్యర్థులు సిబ్బంది నుంచి తపాలా బ్యాలెట్ తీసుకుని ఓటేసుకునే వారు. డబ్బులకు పోస్టల్ బ్యాలెట్లను అమ్ముకుంటున్నారన్న ఆరోపణల దృష్టిలో పెట్టుకుని ఈ విధానానికి ఎన్నికల సంఘం చెక్ పెట్టింది.

జిల్లాలో సుమారు 6,900 మంది ఉద్యోగులు

జిల్లాలో సుమారు 6,900మంది అధికారులు, సిబ్బంది ప్రత్యక్షంగా ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. ఈ సారి డ్రైవర్లు, వీడియో గ్రాఫర్లు, పోలీస్ సిబ్బందితో పాటు మీడియా ప్రతినిధులు కూడా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్నారు. పోస్టల్ బ్యాలెట్ జారీ, పోలింగ్ నిర్వహణ బాధ్యతలను జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక పర్యవేక్షిస్తుండగా జిల్లా నోడల్ అధికారిగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శంకర్‌ను నియమించారు. జిల్లాలో సుమారు 9వేలకు పైగా పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.

ముగ్గురు సిబ్బందితో పోలింగ్

పోలింగ్ నిర్వహించేందుకు ఫెసిలిటేషన్ కేంద్రంలో ముగ్గురు సిబ్బంది ఉంటారు. ఓటేసేందుకు ప్రత్యేక కంపార్ట్ మెంట్, నియోజకవర్గాల వారీగా బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేస్తారు. పోలింగ్ ప్రక్రియ ముగిశాక ఆయా నియోజకవర్గాలకు ఆ బాక్స్‌ను తరలిస్తారు. అభ్యర్థుల ఏజెంట్లకు ముందస్తు సమాచారం కూడా ఇస్తారు.

ఏర్పాట్లు జరుగుతున్నాయి

ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌కు కసరత్తులు జరుగుతున్నాయి. రెండోసారి శిక్షణ ముగిశాక సాయంత్రం నాలుగు గంటల నుంచి 6 గంటలలోపు వారు ఓటేయాల్సి ఉంటుంది. సిబ్బందికి ముందస్తుగా తపాలా పోస్టును ఇవ్వం. కేంద్రానికి వచ్చాకే ఇస్తాం. అక్కడే ఓటేసి బాక్స్‌లో వేయాలి. ఈ ప్రక్రియ నిర్వహణపై పూర్తి సమాచారం రావాల్సి ఉంది.

– ఎస్. వెంకట్రావు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

ఇలా వినియోగించుకోవాలి

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ముందుగా మొదటి విడత శిక్షణ సమయంలో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు ఫారం–12 అందజేశారు. ఇప్పటికే పీఓలు, ఏపీఓలకు మొదటి విడత శిక్షణ ముగిసింది. వారి వద్ద నుంచి సుమారు 4,500 ఫారాలు తిరిగి స్వీకరించారు. ఈ నెల 15 వరకు ఈ ఫారం సమర్పించేందుకు గడువు ఉంది. మొత్తం ఫారాలు వచ్చాక వారికి ఓటు హక్కున్న నియోజకవర్గాల ఆర్‌ఓలకు పంపిస్తారు. ఆ దరఖాస్తులను పరిశీలించి వివరాలు సక్రమంగా ఉంటే పోస్టల్ బ్యాలెట్‌ను వారు విధులు నిర్వహించే నియోజకవర్గాల ఆర్‌ఓలకు నేరుగా పంపిస్తారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు సంబంధించిన సిబ్బంది ఈ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. పీఓలు, ఏపీఓలు, ఇతర పోలింగ్ సిబ్బంది వీరిలో ఉన్నారు. వీరందరికి రెండో విడత శిక్షణ రోజున అక్కడే ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఇస్తారు. అక్కడే ఓటు వేసి నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన బాక్సుల్లో పోస్టల్ బ్యాలెట్ వేయాల్సి ఉంటుంది.

నేడు ఎంజీయూ స్నాతకోత్సవం

హాజరుకానున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

- 17 మందికి పీహెచ్‌డీ డాక్టరేట్
- 40 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్
- ఏర్పాట్లు పూర్తి చేసిన యూనివర్సిటీ అధికారులు



ఎంజీయూ (నల్లగొండరూరల్): మహాత్మాగాంధీ యూనివర్సిటీ 3వ స్నాతకోత్సవం బుధవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈమేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 17 మంది పీహెచ్‌డీ అభ్యర్థులకు డాక్టరేట్, వివిధ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 40 మంది విద్యార్థులకు గవర్నర్ గోల్డ్ మెడల్స్ అందజేయనున్నారు.

గోల్డ్ మెడల్స్‌కు దాతల చేయూత..

యూనివర్సిటీలో చదివిన విద్యార్థులకు 20 కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి దాతల సాయంతో ప్రతి ఏడాది గోల్డ్ మెడల్స్ అందిస్తున్నారు. ఎన్నాళ్లైలు యూనివర్సిటీలో బోధించి పదవీ విరమణ చేసిన వారు, శాస్త్రవేత్తల కుటుంబాలకు చెందిన వారు, పారిశ్రామిక వేత్తలు, వారి కుటుంబ సభ్యులపేరిట యూనివర్సిటీకి నగదు సమకూర్చి వారి పేరిట బంగారు పతకాలు అందిస్తున్నారు.

గవర్నర్‌కు సమస్యల స్వాగతం

యూనివర్సిటీకి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం లేదు. న్యాక్ గుర్తింపునకు కోట్ల రూపాయలు ఖర్చు చేసినా పెద్దగా పురోగతి లేకుండా బీ గ్రేడ్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఫ్యాకల్టీ కోసం రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన క్వార్టర్స్ నిరుపయోగంగా ఉన్నాయి. బాయ్స్ హాస్టల్ చిన్నపాటి వర్షానికే కురుస్తోంది. 2012లో రెగ్యులర్ ప్రాతిపదికన అసిస్టెంట్, అసోసియేషన్ ప్రొఫెసర్ల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చి రిక్రూట్‌మెంట్ చేసిన 31 మంది అధ్యాపకుల నియామకాలపై కాలయాపన కొనసాగుతోంది. యూనివర్సిటీ పరీక్షల విభాగం వివాదాలకు నిలయంగా మారింది. రెండు, మూడేళ్ల వరకు పరీక్షల విభాగం అధిపతి ఉండాల్సి ఉండగా ఏడేళ్లుగా కొనసాగడం గమనార్హం. కొత్త కోర్సుల ఊసే లేకుండా పోయింది. కొందరు అధ్యాపకులపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినప్పటికీ వారిని తొలగించి మళ్లీ నియమించడంలో అంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇంజనీరింగ్ భవనం పూర్తయినా మొదటి ఏడాది విద్యార్థులకు పానగల్‌లో ఉన్న యూనివర్సిటీ భవనంలోనే తరగతులు బోధిస్తున్నారు. గవర్నర్ రాకతో యూనివర్సిటీలో నెలకొన్న ఈ సమస్యలు పరిష్కారమవుతాయని విద్యార్థులు, అధ్యాపకులు భావిస్తున్నారు.

గవర్నర్ పర్యటన ఇలా..

- ఉదయం 10 గంటలకు యూనివర్సిటీలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్, డీన్స్, ఫ్యాకల్టీలతో సమావేశమవుతారు.
- 10.20 గంటలకు యూనివర్సిటీ ఈసీ సమావేశం నిర్వహిస్తారు.
- 10.40 గంటలకు గవర్నర్ రానున్నారు.
- 11.15గంటలకు వార్షిక నివేదిక వినిపిస్తారు.
- 11.30గంటలకు కాన్వకేషన్ ప్రారంభం.
- 12.20గంటలకు గవర్నర్ ప్రసంగం
- 12.50గంటలకు స్నాతకోత్సవం ముగుస్తుంది.

విద్యార్థులకు, అధ్యాపకులకు మధురానుభూతి

మొట్టమొదటిసారిగా పీహెచ్‌డీ అభ్యర్థులకు గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందించడం గొప్ప అనుభూతి. ప్రతి ఏడాది విద్యార్థులకు బంగారు పతకాలను అందించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో మధురానుభూతి ఉంటుంది. మిగతా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని చదువుల్లో పోటీ పడతారు. గవర్నర్ రాకతో యూనివర్సిటీ సమస్యలు కూడా పరిష్కారమవుతాయనే ఆకాంక్ష ఉంది.

– గోపాల్‌రెడ్డి ఎంజీయూ వీసీ

● మౌలానాజీ.. బీఆర్‌ఎస్‌కా సాథ్ దేవ్



మక్కాను సందర్శించుకొని నల్లగొండకు వచ్చిన జమియత్ ఉలమా జిల్లా ప్రెసిడెంట్ మౌలానా ఎహసానుద్దీన్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న నల్లగొండ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి

● అంతులేని అభిమానం





నల్లగొండలో మంగళవారం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నామినేషన్ ర్యాలీలో ఆయన పచ్చబొట్టు చూపుతున్న అభిమానులు

మలిదశ కష్టమవుతోంది

రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు నేటికీ అందని 'ప్రత్యేక రాష్ట్ర ఇంక్రిమెంట్'

- ప్రతినెలా పదో తేదీ వచ్చినా పెన్షన్ అందడంలో జాప్యం జరుగుతోంది
- ఉచిత వైద్యంతో పాటు బస్సులు, రైలు ప్రయాణాల్లో రాయితీ కల్పించాలి
- పెండింగ్‌లో ఉన్న మూడు డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్)లు వెంటనే విడుదల చేయాలి
- పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా డీఆర్ పెంచాలి

సాక్షి పీపుల్స్ ఎజెండాలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్



కోదాడలో పీపుల్స్ ఎజెండా కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు, పింఛన్‌దారులు

పీపుల్స్ ఎజెండా

గింజల అప్పిరెడ్డి, కోదాడ



ప్రభుత్వ ఉద్యోగులుగా మూడు, నాలుగు దశాబ్దాలు పనిచేసిన వారికి ఉద్యోగ విరమణ అనంతరం మలిదశలో అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వాలు మారినా వారి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. సమస్యలపై గళమెత్తినా, వినతుల సమర్పించినా కనీసం పిలిచి మాట్లాడేవారు కరువయ్యారు. ఈ క్రమంలో మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో 'పెన్షన్‌దారుల సమస్యలు– పరిష్కార మార్గాలు' అనే అంశంపై నిర్వహించిన పీపుల్స్ ఎజెండాలో పలువురు రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నాయకులు, పింఛన్‌దారులు తమ సమస్యలను వెల్లడించారు.

జీవిత చరమాంకంలో తమ సమస్యలు పరిష్కరించడం అటుంచి.. పాలకులు తమకు సమయం ఇవ్వకుండా తమ ఆత్మాభిమానం దెబ్బతినే విధంగా ప్రవర్తిస్తున్నారని విశ్రాంత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రస్తుత ఉద్యోగులతో పాటు రిటైర్డ్ ఉద్యోగులకు కూడా ప్రత్యేక రాష్ట్ర ఇంక్రిమెంట్ ఇస్తామని చెప్పారని, రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు అవుతున్నా నేటికీ అది అమలుకు నోచుకోలేదని అంటున్నారు. ఉద్యోగ విరమణ చేసిన రోజునే అందాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ రెండు సంవత్సరాలకు కూడా అందడడం గగనమైందని వాపోతున్నారు. వయస్సు మీద పడడంతో తాము ఎదుర్కొంటున్న ఆరోగ్యపరమైన సమస్యల కోసం వైద్యశాలలకు వెళ్తే తమ హెల్త్‌కార్డులను ఒక్క వైద్యశాల కూడా అంగీకరించకుండా వెనక్కి తిప్పి పంపుతున్నారని, తమతో చర్చించకుండానే ప్రభుత్వం తమ సమస్యలపై వారికి తోచిన నిర్ణయాలు తీసుకుంటున్నారని ఇది మంచిది కాదని విశ్రాంత ఉద్యోగులు అంటున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందున్న తమను ప్రభుత్వం వెనక్కి నెట్టి వేశాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంక్రిమెంట్ నేటికీ ఇవ్వలేదు



ప్రభుత్వ ఉద్యోగులుగా తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించాం. ప్రస్తుతం రిటైర్డ్ అయ్యాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే మాకు తెలంగాణ రాష్ట్ర ఇంక్రిమెంట్ ఇస్తామని చెప్పారు. రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు దాటుతున్నా నేటికీ దాన్ని అమలు చేయకపోవడం అన్యాయం. దీనిపై ప్రభుత్వానికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకునేవారు కరువయ్యారు.

– రావెళ్ల సీతరామయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఉచిత వైద్యం అందడం లేదు



రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హెల్త్‌కార్డులను రాష్ట్రంలో ఏ కార్పొరేట్ ఆస్పత్రి అంగీకరించడం లేదు. అనారోగ్య సమస్యలతో వెళ్తే తిరస్కరిస్తున్నారు. వృద్ధాప్యంలో వచ్చే పింఛన్ డబ్బులు మొత్తం వైద్యం కోసమే ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని హెల్త్ కార్డులను అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అనుమతించేలా చూడాలి.

– గడ్డం నర్సయ్య, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు

ప్రయాణంలో రాయితీలు ఇవ్వాలి



రిటైర్డ్ ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్తున్న సమయంలో బస్సుల్లో, రైళ్లలో రాయితీలను అమలు చేయాలి. అనేక రాష్ట్రాలలో రిటైర్డ్ ఉద్యోగులకు దీనిని అమలు చేస్తున్నారు. తెలంగాణలో మాత్రం ఇక్కడి ప్రభుత్వం దీనిని పట్టించుకోవడం లేదు. రిటైర్డ్ ఉద్యోగులకు, సీనియర్ సిటిజన్స్‌కు ప్రయాణ సమయాల్లో తప్పనిసరిగా 30 నుంచి 50 శాతం రాయితీ ఇవ్వాలి.

– బి. భీక్షం, కోదాడ యూనిట్ కార్యదర్శి

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి



ఉద్యోగ విరమణ చేసిన తర్వాత అందాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ సంవత్సరంన్నర దాటినా అందడం లేదు. దీని వల్ల ఉద్యోగ విరమణ చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని రకాలుగా నష్టపోతున్నారు. గతంలో ఉద్యోగ విరమణ చేసిన రోజే అన్ని రకాల బెనిఫిట్స్ అందిస్తామని చెప్పారని, కానీ అది అమలు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

– జి. భ్రమరాంబ, కోదాడ యూనిట్ మహిళా కార్యదర్శి

పెండింగ్ డీఆర్‌ను వెంటనే ఇవ్వాలి



ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడు డీఆర్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని వెంటనే చెల్లించాలి. వాటిని పెండింగ్‌లో పెట్టడంతో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవిష్యత్తులో కూడా డీఆర్‌లను పెండింగ్‌లో పెట్టకుండా సకాలంలో చెల్లించాలి. రిటైర్డ్ ఉద్యోగులు వీటి మీదే ఆధారపడి జీవిస్తున్నారన్న విషయాన్ని ప్రభుత్వాలు గుర్తుంచుకోవాలి

– ఎండీ జాఫర్, పింఛన్‌దారుడు

వాయిదాల పద్ధతి సరికాదు



రిటైర్డ్ ఉద్యోగులకు ఇస్తున్న డీఆర్‌ను సకాలంలో ఇవ్వాలి. అంతేకాకుండా రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ వాయిదాల పద్ధతిలో ఇస్తున్నారు. అలా కాకుండా ఒకేసారి ఇస్తే రిటైర్డ్ ఉద్యోగులకు ఉపయోగం ఉంటుంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రిటైర్డ్ ఉద్యోగలకు ఇచ్చే డీఆర్‌ను పెంచాలి

– ఎం. వెంకటేశ్వరరావు, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కార్యదర్శి

ఒకటో తేదీన పింఛన్ అందట్లే



తెలంగాణ ఏర్పడిన తర్వాత రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ సకాలంలో అందడం లేదు. ప్రతి నెలా ఒకటో తేదీన అందాల్సిన వేతనాలు 10వ తేదీ వరకు వస్తాయన్న గ్యారంటీ లేకుండా పోయింది. వృద్ధాప్యంలో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినప్పుడు, రోజువారీ అవసరాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్ సకాలంలో అందేవిధంగా ప్రభుత్వం చూడాలి.

– వై. లక్ష్మీనర్సయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం కోదాడ యూనిట్ కార్యదర్శి

సీపీఎస్‌ను రద్దు చేయాలి



లక్షల మంది ఉద్యోగుల జీవితాలతో ఆధారపడి ఉన్న కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను తెలంగాణ ప్రభుత్వం వెంటనే రద్దు చేసి దాని స్థానంలో ఓల్డ్ పెన్షన్ స్కీం(ఓపీఎస్)ను ప్రవేశ పెట్టాలి.30–40 సంవత్సరాలు పనిచేసిన ఉద్యోగులు రిటైర్డ్ అయితే వారికి కనీస ఆర్థిక ప్రయోజనాలు లేక తీవ్ర ఇబ్బంది పడతారు.

– బొల్లు రాంబాబు, విశ్రాంత ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి

డెత్ రిలీఫ్‌మెంట్ రూ.30వేలకు పెంచాలి



ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగికి డెత్ రిలీఫ్‌మెంట్ చాలా తక్కువగా ఇస్తున్నారు. వేతనం, పింఛన్‌తో సంబంధం లేకుండా దీన్ని కనీసం రూ.30 వేలకు పెంచాలి. దీనిపై ప్రభుత్వాలకు రిటైర్డ్ ఉద్యోగులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదు. తమ జీవితకాలం మొత్తం ప్రజల కోసం పనిచేసిన వారి విషయంలో ప్రభుత్వాలు మానవతా దృక్పథంతో ఆలోచించి డెత్ రిలీఫ్‌మెంట్ పెంచాలి.

– కె. హరిబాబు, పింఛన్‌దారుడు

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సొంత ఇల్లు లేదు

- ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న భువనగిరి ఎంపీ
- గత ఎన్నికల కంటే పెరిగిన ఆస్తులు, అప్పులు

నల్లగొండ: తనకు సొంత ఇల్లు కూడా లేదని నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. మంగళవారం ఆయన నల్లగొండ ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా అఫిడవిట్‌లో ఆయన ఆస్తుల వివరాలు వెల్లడించారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఆస్తులతో పాటు అప్పులు కూడా పెరిగాయి. 2018 ఎన్నికల్లో స్థిర, చరాస్తులు కలిపి మొత్తం రూ.68,37,727 ఉండగా.. ప్రస్తుతం స్థిర, చరాస్తులు కలిపి రూ.1,61,47,070గా పేర్కొన్నారు. గత ఎన్నికల్లో తన పేరిట అప్పు ఏమీ చూపని ఆయన ప్రస్తుతం రూ.1,70,00,000 అప్పు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపించారు. అదేవిధంగా 9.39 ఎకరాల భూమి ఆయన పేరు మీద ఉన్నట్లు చూపించారు. ఇదిలా ఉంటే కోమటిరెడ్డి వెంకటరెడ్డి సతీమణి సబిత పేరు మీద 2018 ఎన్నికల సందర్భంగా రూ.15,75,71,331 ఆస్తులు ఉండగా ప్రస్తుతం అవి రూ.37,62,25,329కు పెరిగాయని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. గతంలో ఆమె పేరు మీద రూ.2,41,88,856 అప్పు ఉండగా ప్రస్తుతం రూ.4,74,77,630కి అప్పు పెరిగిందని అఫిడవిట్‌లో చూపించారు.

జంగ్ తెలంగాణ

బీజేపీ అభ్యర్థుల ప్రొఫైల్

నకిరేకల్ : నకిరేకంటి మొగిలయ్య
తల్లిదండ్రులు : మల్లయ్య, మల్లమ్మ
పుట్టిన తేదీ : 01-11-1974
స్వస్థలం : రామన్నపేట (బీసీ కాలనీ),
భార్య : పద్మ, **కుమార్తె**: శ్రావణి
చదువు : బీఏ, ఎల్ఎల్‌బీ
రాజకీయ ప్రస్థానం : 1994లో బీజేపీలో చేరారు. 2014 నుంచి 2018 వరకు రామన్నపేట సర్పంచ్‌గా పనిచేశారు. 2009లో బీజేపీ నుంచి నకిరేకల్ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు.

మునుగోడు : చలమల్ల కృష్ణారెడ్డి
తల్లిదండ్రులు : రంగారెడ్డి, సుగుణమ్మ
పుట్టిన తేదీ : 01-02-1968
స్వస్థలం : మల్లారెడ్డిగూడెం, సంస్థాన్‌నారాయణపురం మండలం
భార్య : రజిత, **కుమారులు** : వినయ్‌కుమార్ రెడ్డి, వినిత్‌కుమార్‌రెడ్డి
చదువు : డిగ్రీ
రాజకీయ ప్రస్థానం : గతేడాది మునుగోడు ఉప ఎన్నికలో కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డారు. ప్రస్తుతం కూడా కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో ఆ పార్టీకి రాజీనామా చేసి ఈ నెల 1వ తేదీన బీజేపీలో చేరారు.

మిర్యాలగూడ : సాధినేని శ్రీనివాస్‌రావు
తల్లిదండ్రులు : కృష్ణవేణి, సత్యనారాయణ
పుట్టిన తేదీ : 10-06-1970
స్వస్థలం : కాలువపల్లి, మిర్యాలగూడ మండలం
ప్రస్తుత నివాసం : మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు
భార్య : రమా, **సంతానం**: అనన్య, కృష్ణచైతన్య
చదువు : ఎంఏ (పొలిటికల్ సైన్స్)
రాజకీయ ప్రస్థానం : 2014 నుంచి 2019 టీడీపీలో కొనసాగారు. 2019లో ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు.

◆ తెలంగాణ కోసం మంత్రి పదవులు త్యాగం



కొండా లక్ష్మణ్ బాపూజీ



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొంది మంత్రి పదవులు పొందిన ఇద్దరు నాయకులు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తమ మంత్రి పదవులకు రాజీనామా చేశారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగంగా 1969లో అప్పటి భువనగిరి ఎమ్మెల్యే కొండా లక్ష్మణ్ బాపూజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉండి తన పదవికి రాజీనామా చేశారు. అదేవిధంగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగంగా నల్లగొండ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 2011లో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో ఐటీ శాఖ మంత్రిగా ఉండి తన పదవికి రాజీనామా చేశారు. కాగా కొండా లక్ష్మణ్ బాపూజీ 1957లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చిన్నకొండూరు నుంచి, 1965 ఉప ఎన్నికలో భువనగిరి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మొదటిసారి 1999లో కాంగ్రెస్ పార్టీ నుంచి నల్లగొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత వరుసగా 2004, 2009, 2014లోనూ గెలిచారు.

కామారెడ్డిలో మంచ్యాతండా వాసి నామినేషన్



కామారెడ్డిలో ఆర్‌ఓకి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సుమన్‌నాయక్

మఠంపల్లి: మండలంలోని మంచ్యాతండాకు చెందిన ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకుడు, గుర్రంబోడుతండా భూపరిరక్షణ సమితి అధ్యక్షుడు సపావట్ సుమన్‌నాయక్ మంగళవారం కామారెడ్డి నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇస్తానని చెప్పి పట్టించుకోనందునే కామారెడ్డి నియోజకవర్గంలో సీఎం కేసీఆర్‌పై పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సపావట్ సర్దార్, రంజాన్, మంగమ్మ, తిరుపతి తదితరులున్నారు. కాగా ఇప్పటికే సుమన్‌నాయక్ గజ్వేల్‌లో కూడా నామినేషన్ వేసిన విషయం తెలిసిందే.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు నేడు చివరి తేదీ

- వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం



భువనగిరిటౌన్: 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులతో పాటు 13 రకాల అత్యవసర సేవల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని ఎలక్షన్ కమిషన్ కల్పించింది. అయితే వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకునే గడువు బుధవారంతో ముగియనుంది. ఈ రోజు సాయంత్రం లోపు బూత్ లెవల్ అధికారుల(బీఎల్‌ఓ) ద్వారా ఫారం–12(డీ)కి దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. ఒకసారి ఆర్‌ఓ అనుమతి వచ్చిన తర్వాత పోస్టల్ బ్యాలెట్ పొందిన ఓటర్ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు వేసేందుకు అవకాశం ఉండదు. పోలింగ్‌కు ముందు ఏవైనా రెండు తేదీలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకు తనకు అనుకూలమైన తేదీని ఎంచుకునే స్వేచ్ఛ ఓటరుకు ఉంది. పొలిటికల్ పార్టీలకు ఆయా తేదీలు, ఓటర్ల సమాచారం అందించిన తర్వాత పార్టీల ఏజెంట్లు కూడా పోస్టల్ ఓటు సమయంలో హాజరుకావచ్చు.

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాన్వాయ్ తనిఖీ



ఆలేరులో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాన్వాయ్‌ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆలేరురూరల్: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాన్వాయ్‌ని ఆలేరు బైపాస్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి పోలీసులకు మంత్రి ఎర్రబెల్లి పూర్తిగా సహకరించారు. మంత్రి వాహనంతో పాటు ఆయన వెంట ఉన్న ఇతర వాహనాలను సైతం పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీ తర్వాత తమకు సహకరించిన మంత్రికి పోలీసులు ధన్యవాదాలు తెలిపారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ప్రజల మేలు కోరేది బీఆర్‌ఎస్ మాత్రమే
- ఉద్యమకారులంతా కలిసిరావాలి ● జిట్టా బాలకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న జిట్టా బాలకృష్ణారెడ్డి

సాక్షి,యాదాద్రి : ఉద్యమ ఆకాంక్షలు నెరవేరాలన్నా, రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందాలన్నా కేసీఆర్ సారథ్యంలోనే సాధ్యమవుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం భువనగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత ప్రాంతాల్లో లేవన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కోటిన్నర ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని, దక్షిణ తెలంగాణకే తలమానికమైన ఎయిమ్స్ అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. యాదాద్రి ఆలయాన్ని ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. దళితబంధు, బీసీబంధు రాలేదని ఎవ్వరూ ఆందోళన చెందవద్దని అర్హులందరికీ విడుతల వారీగా ఆర్థిక సాయం అందుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణకు మళ్లీ అన్యాయం జరుగుతుందన్నారు. ఆ పార్టీలో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో కూడా ప్రకటించలేదని, ఎవరికి వారు తానే సీఎం అభ్యర్థిగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నా ఇప్పటి వరకు అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించలేని స్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. రాష్ట్రంలో రాబంధుల పాలన రాకుండా ఉండాలంటే ఉద్యమకారులంతా బీఆర్‌ఎస్‌తో కలిసిరావాలని, పార్టీ విజయం కోసం ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. భువనగిరి నియోజకవర్గ పరిధిలో రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే వారి ఇళ్లకు వెళ్లి కలవనున్నట్లు చెప్పారు. తాను బీఆర్‌ఎస్‌లో చేరడం ద్వారా సొంతగూటికి వచ్చినంత ఆనందంగా ఉందని, 14 ఏళ్ల వనవాసం తీరినట్లుగా ఉందన్నారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలను పార్టీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత ఎంతో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్‌యార్డులో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం



శాలిగౌరారం : మార్కెట్‌యార్డులో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళ

- అత్యధికంగా శాలిగౌరారంలో 32.4 మిల్లీమీటర్ల వర్షపాతం

శాలిగౌరారం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా శాలిగౌరారం మండలంలో సోమవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. మండలంలో 32.4 మిల్లీమీటర్లు(3.2 సెంటీమీటర్లు) వర్షపాతం నమోదైనట్లు డిప్యూటీ తహసీల్దార్ సత్తార్ తెలిపారు. వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం రాశులతోపాటు ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. పలు గ్రామాల్లో కోతదశలో ఉన్న వరి చేలు నేలవాలాయి. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సీసీ ప్లాట్‌ఫామ్ కావడంతో వరద నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. ఈ ధాన్యాన్ని ఎత్తుకునేందుకు, రైతులు నానా అవస్థలు పడ్డారు. కాగా.. పది రోజుల వ్యవధిలో నాలుగు సార్లు వర్షాలు కురువడంతో ధాన్యం వర్షానికి తడిసి దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి క్షేత్రపాలకుడిగా పూజలందుకుంటున్న శ్రీఆంజనేయస్వామికి మంగళవారం ఆకుపూజ ఘనంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయస్వామిని సింధూరంతో అలంకరించి పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో ఆకు పూజ చేశారు. అదేవిధంగా ప్రధానాలయంలో నిత్య పూజలు కొనసాగాయి. శ్రీస్వామివారికి అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు తదితర కైంకర్యాలు గావించారు.

శాస్త్రోక్తంగా శ్రీలక్ష్మీనర్సింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అర్చనలు, నిత్య హోమం, మూలవిరాట్‌మూర్తికి పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణ తంతు మొదలుపెట్టారు. ముందుగా విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ కమనీయంగా నిర్వహించారు. అనంతరం ఆలయ తిరుమాడ వీధుల్లో శ్రీస్వామివారిని గరుడవాహనంపై ఊరేగించారు. తదనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి ప్రత్యేక అర్చనలు, తమలపాకులతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.